క్లుప్తంగా

గర్భిణులకు వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం 23 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి నిఖిల్‌రాజ్ వైద్యపరీక్షలు చేశారు. న్యూట్రిషియన్ కిట్లు అందజేశారు. హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, హెల్త్ అసిస్టెంట్ విష్ణు, ఏఎన్‌ఎంలు పూర్ణిమ, సంధ్యారాణి, దివ్య తదితరులు ఉన్నారు.

షీటీమ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వాణిశ్రీ

ఇంద్రవెల్లి: షీటీమ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని షీటీమ్ టీమ్ లీడర్ వాణిశ్రీ కోరారు. మండలంలోని కేస్లాపూర్ ఆశ్రమ బాలికల వసతి గృహంలో మంగళవారం షీటీమ్ సేవలపై అవగాహన కల్పించారు. మహిళలు, యువతులు, విద్యార్థినులకు ఎవరైన వేధిస్తే వెంటనే షీటీమ్‌ను సంప్రదించాలన్నారు. హెచ్‌ఎం పుల్‌చందర్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఉన్నారు.

వాల్‌పోస్టర్, ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది

గుడిహత్నూర్: ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో గ్రామాల్లో వివిధ పార్టీల నాయకులు ఇదివరకే ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు, వాల్ రైటింగ్‌లను పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారు. మండల కేంద్రంలో సిబ్బంది మంగళవారం ఈ పనిలో నిమగ్నమయ్యారు. కార్యదర్శి చక్రవర్తి పర్యవేక్షణలో పార్టీ పోస్టర్లు లేకుండా చేశారు.

ఆటో, టాక్సీ డ్రైవర్లను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఫెరోజ్‌ఖాన్

నార్నూర్: ఆటో,టాక్సీ డ్రైవర్లను ఆదుకోవాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందని ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫెరోజ్‌ఖాన్ అన్నారు. హె చ్‌కేజీన్ ఆటో యూనియన్ కార్యాలయంలో డ్రైవర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆ యన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ సర్కార్ అమలు చేస్తున్న వైఎస్‌ఆర్ వాహన మిత్ర స్కీం లా గానే తెలంగాణలో అమలు చేయాలని డిమాండ్ చే శారు. ఆటో డ్రైవర్స్, టాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేల ఆర్థికసాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఉప చట్టాన్ని రద్దు చేయాలి

బేల: కేంద్ర ప్రభుత్వం ఉప చట్టాన్ని రద్దు చేయాలని బహుజన జాగృతి సేన జిల్లా అధ్యక్షుడు బుద్ధరతన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోని ప్రజాస్వామ్య శక్తులను అంతం చేయడానికి ఈ ఉప చట్టాన్ని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించా రు .సామాన్య ప్రజాసంఘాలు, విద్యార్థి, ఉద్యోగ, కార్మిక, మేధావి సంఘాలను శాంతి యుతంగా పనిచేయకుండా అక్రమ అరెస్టులు చేయించడం సరికాదన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సిద్దార్థ తల్వారే, కమిటీ స భ్యుడు రమేశ్ మోతివారి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడికి సన్మానం



సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

కైలాస్‌నగర్: శాంతి సామరాస్యతను కాంక్షించి పవిత్ర యాత్ర మక్కా సందర్శనకు కుటుంబ సమేతంగా వెళ్లనున్న డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్‌ను మంగళవారం ఆ పార్టీ మైనార్టీ నాయకులు సన్మానించారు. శాంతినగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువలతో సన్మానించారు. పార్టీ నాయకులు హైమద్, సేవాలాల్, మోతీరామ్, సాబీర్, మునీర్, రసూల్, రిజ్వాన్, నసీర్ అక్తర్ అజీజ్, అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల మోత

- కంపుకొడుతున్న కాలనీలు
- పారిశుధ్యం అస్తవ్యస్తం
- సీజనల్ వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు



జ్వరంతో బాధపడుతున్న కొడప రాజు



కొలాంగూడలో నివాసం చుట్టూ ప్రాంతంలో పిచ్చిమొక్కలు



సౌకర్యాలు లేక దిగులుగా చూస్తున్న మహిళ

నార్నూర్: వర్షాకాలం వచ్చిందంటే చాలు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతుంటాయి. ఈనెలలో ఎడతెరిపి లేకుండా కురిసిన ముసురుతో గ్రామాల్లోని వీధులు బురదమయం అయ్యాయి. కాలనీల్లో మురుగునీరు నిలవడంతో కంపుకొడుతోంది. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఇటు ఈగల మోత.. అటు దోమల మోత మార్మోగుతోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన జిల్లా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మలేరియా, డెంగీ బారినపడి పీహెచ్‌సీలకు వెళ్తే డాక్టర్లు అందుబాటులో ఉన్నా వైద్యం చేయక పెద్దాస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. ప్రస్తుతం ఓవైపు సీజనల్ వ్యాధులు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. జిల్లాలోని ఏజెన్సీ ప్రాతంలో మొత్తం 33 పీహెచ్‌సీలు ఉన్నాయి. ప్రతీ గ్రామంలో మలేరియా, టైఫాయిడ్, ఫైలేరియా, డయేరియా జ్వరం బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. నార్నూర్ మండలం కొత్తపల్లి–హెచ్ కొలాంగూడలో గిరిజనులు వైరల్ జ్వరంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో కొలాంగూడను సందర్శించి ఆరా తీశారు.

డిప్యూటేషన్‌పై ఒకే ఒక్కడు..

మండల కేంద్రంలోని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి దాదాపు ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు ఒక వైద్యులను నియమించలేదు. శానిటేషన్ సిబ్బందిని మాత్రమే నియమించి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీ సిబ్బందితోనే ఆస్పత్రిలో సేవలందిస్తున్నారు. పీహెచ్‌సీకి సైతం వైద్యులు లేకపోవడంతో దాదాపు ఐదేళ్లుగా పోస్టు ఖాళీగానే ఉంది. ప్రస్తుతం ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి పీహెచ్‌సీ వైద్యుడు రాంబాబును డిప్యూటేషన్‌పై నియమించారు. ఐదుగురు వైద్యులు ఉండాల్సిన చోట ఒకేఒక్కడు విధులు నిర్వహిస్తుండడంతో రోగులకు ఇబ్బంది తప్పడం లేదు. సీజనల్ వ్యాధులు నివారణకు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించలేకపోతున్నారు. దీంతో కొందరు రోగులు బయట ప్రైవేట్ ఆర్‌ఎంపీ వైద్యులను ఆశ్రయించి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. జిల్లా అధికారులు స్పందించి రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

> **పకడ్బందీ చర్యలు**
>
> ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామాల్లో పారిశుధ్య లోపంతో దోమలు అధికంగా ఉన్నాయి. మలేరియా కేసులు లేదు. డెంగీ కేసులు నమోదవుతున్నాయి. వాటి నివారణకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలతోపాటు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాం. జలుబు, దగ్గు వంటి చిన్న సమస్యలు ఉన్నాయి. అన్ని రకాల పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం.
>
> – బాలు, ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి, ఉట్నూర్



పంటలో మందులను పిచికారీ చేస్తున్న డ్రోన్

డ్రోన్..పిచికారీ

- రైతులకు సమయం, డబ్బు ఆదా
- తీరనున్న కూలీల కొరత



డ్రోన్‌తో పిచికారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

తాంసి: వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయి. పంటలకు రసాయన పురుగు మందుల పిచికారీకి రైతులు డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా వానాకాలం సీజన్‌కు ముందు మొదలుకొని, ప్రస్తుతం పంటలకు డ్రోన్ల ద్వారా పురుగుల మందుల పిచికారీ చేపడుతున్నారు. దీని ద్వారా సమయం, ఆదా అవుతుంది. దీంతో పలువురు డ్రోన్ల యంత్రాలు కొనుగోలు చేసి రైతులకు అద్దెకు ఇస్తున్నారు. ఎకరాకు రూ.400 వరకు చెల్లించడంతో ఆదాయం పొందుతున్నారు.

కూలీల కొరత చెక్

పంటచేలలో కూలీల కొరత తీవ్రంగా ఉంది. కూలీల దొరక్క పనులు చేయించలేక పంట దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. పంటలకు చీడపీడలు, పురుగుల నివారణకు పిచికారీ చేసేందుకు కూలీలు దొరకని పరిస్థితి. దీన్ని అధిగమించేందుకు డ్రోన్లు వినియోగంలోకి వచ్చాయి. పత్తి, సోయా, కంది పంటలకు రైతులు డ్రోన్ల ద్వారా పిచికారీ చేస్తున్నారు.

ఎకరాకు..పది నిమిషాలు

సాధారణంగా చార్జింగ్ పంపుసెట్లు, తైవాన్ పంపుల ద్వారా పురుగు మందులు పంటలకు స్ప్రే చేస్తారు. ఇలా పిచికారీ చేయడం ద్వారా ఎకరాకు మూడు గంటల సమయం పడుతుంది. రోజు రెండెకరాలకు మాత్రమే సమయం సరిపోతుంది. చేలో పంపుల్లో నీళ్లు పోయడానికి ఒకరు, స్ప్రే చేయడానికి ఒక కూలీ చొప్పున ఇద్దరు కూలీల అవసరం ఉంటుంది. అదే డ్రోన్ ద్వారా 20 నిమిషాల్లో రెండెకరాలకు పిచికారీ చేయవచ్చు. ఎకరాకు 10 నిమిషాల సమయం పడుతుంది.

డ్రోన్ పిచికారీలో శిక్షణ

ఆదిలాబాద్‌కు చెందిన సీహెచ్ సురేంద్రబాపు బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తిచేశాడు. సాగులో డ్రోన్ ద్వారా మందుల పిచికారీ చేయాలని ఆలోచన వచ్చింది. హైదరాబాద్‌లోని మియాపూర్ ఉన్న అగ్రి విహంగ సర్వీసెస్‌లో డ్రోన్ పిచికారీలో శిక్షణ అనంతరం డీహెచ్‌ఏ ద్వారా లైసెన్స్ పొందాడు. రూ.10 లక్షలతో డ్రోన్ కొనుగోలు చేశాడు. రైతులకు డ్రోన్ పిచికారీపై అవగాహన కల్పించారు.

> **ఖర్చు తక్కువ**
>
> 
>
> మొదటగా పంటచేను మార్కింగ్ చేసుకోవాలి. డ్రోన్‌లో 20 లీటర్ల నీటిని నింపితే రెండు ఎకరాల్లో పిచికారీ చేయవచ్చు. డ్రోన్‌తో 200 మీటర్ల వరకు సులభంగా స్ప్రే చేయవచ్చు. రైతులు ఖర్చు తక్కువగా ఉంటుంది. డ్రోన్‌లో మూడు బ్యాటరీలు ఉన్నాయి. ఒక రోజు 15 ఎకరాల్లో పిచికారీ పూర్తిచేయవచ్చు
>
> – సీహెచ్ సురేంద్రబాపు, డ్రోన్ ఆపరేటర్, ఆదిలాబాద్

> **అవగాహన కల్పించాలి**
>
> 
>
> పంటలకు డ్రోన్ల ద్వారా మందుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పించాలి. ప్రతీ మండలంలో రైతులకు అందుబాటులో ఉండేలా వ్యవసాయశాఖ తరపున డ్రోన్లను అందుబాటులో ఉంచాలి. రాయితీపై అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
>
> – ఎల్టి నరేశ్‌రెడ్డి, యువరైతు కరంజి(టి)

ఆరు గ్యారెంటీలపై కాంగ్రెస్ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో మంగళవారం గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శాంతినగర్, కొత్త కుమ్మరివాడ, ధన్‌గర్‌గల్లీలో ప్రచారం చేసిన పార్టీ నాయకులు ఏఐసీసీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు నగేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళలకు రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. చేయూత కింద వృద్ధులకు రూ.4 వేలు, మహిళలకు రూ.2500 పెన్షన్, గృహలక్ష్మి పథకం కింద రూ.5 లక్షల ఆర్థికసాయం అమలు చేస్తోందని వెల్లడించారు. సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మోతీరాం, మైనారిటీ టౌన్ అధ్యక్షుడు రసూల్, మాజీ పట్టణ అధ్యక్షుడు వసీమ్, వైస్ ప్రెసిడెంట్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు హరిప్రియ, సంతోష్‌లు విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. రక్తహీనత సమస్య ఉన్న వారికి రిమ్స్‌కు రెఫర్ చేశారు. ప్రిన్సిపాల్ పావనికుమారి, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి లక్ష్మణ్, అధ్యాపకులు గణేశ్, దశరథ్, శ్రీలత, తిరుపతి, రూప, వినోద్, కేశవులు, కిశోర్ పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధే ధ్యేయం



దేవపూర్‌లో పర్యటిస్తున్న అనిల్ జాదవ్, అడ్డి భోజారెడ్డి

తలమడుగు: అన్నివర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని బీఆర్‌ఎస్ బోథ్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని దేవాపూర్, కజ్జర్ల గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. వచ్చేఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మండల కన్వీనర్ తోట వెంకటేశ్, సర్పంచ్ అబ్దుల్లా, కేదారేశ్వర్‌రెడ్డి, మోట్టే కిరణ్, రైతుబంధు అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, సునీతారెడ్డి, పల్లవి తిరుమల్‌గౌడ్, గ్రామపెద్ద దేవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనిల్‌జాదవ్‌ను గెలిపించుకుంటాం

బోథ్: బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌ను అధిక మెజార్టీతో గెలిపించుకుంటా మని నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆత్మ చైర్మన్ సుభాష్, బోథ్ సర్పంచ్ సురేందర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు భీమ బుచ్చన్న, సోషల్ మీడియా కన్వీనర్ రవీందర్, దాసరి రాజు, దేవిదాస్, జె.స్వామి, గంగాధర్, రఫీ, రాజేందర్ పాల్గొన్నారు.

‘శ్వేతపత్రం విడుదల చేయాలి’



మాట్లాడుతున్న నాయకులు

ఎదులాపురం: ఆదివాసీ గ్రామాల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాలపై రాజకీయ పార్టీలు శ్వేతపత్రం విడుదల చేశాకే గిరి గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి రావాలని ఆదివాసీ భారత్ మహాసభ నాయకుడు కినక సురేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వాలు తమ కోసం ఏం చేశాయో చెప్పి గ్రామాల్లోకి ప్రచారానికి రావాలన్నారు. లేకపోతే వారిని అడ్డుకుంటామని హెచ్చరించారు.

కంపు..కంపు



ఇచ్చోడ: ఇచ్చోడ మేజర్ పంచాయతీ కార్మికుల సమ్మెతో పారిశుధ్య పనులు నిలిచిపోయాయి. మండల కేంద్రంలోని పలు కూడళ్ల వద్ద చెత్త పేరుకుపోయింది. తీవ్ర దుర్గంధంతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లేదారిలో చెత్త వేస్తుండడంతో మంగళవారం అటు వెళ్లే ప్రజలు, కాలనీవాసులు ముక్కుమూసుకున్నారు.

ఫ్లెక్సీ చించివేయడం హేయమైన చర్య



చించిపడేసిన ఫ్లెక్సీలు

ఎదులాపురం: ‘సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ కోసం అమిత్ షా వెంటనే స్పందించండి’అని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేసి చెత్తకుప్పలో, మురికి నాళీలో పడేయడాన్ని సీసీఐ సాధన కమిటీ తీవ్రంగా ఖండించింది. సాధన కమిటీ ఆధ్వర్యంలో సభాస్థలం (పట్టణంలోని డైట్ మైదాన) పరిసర ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కేంద్ర నాయకుల కంటపడకుండా వాటిని చించి తొలగించడం హేయనీయమని కన్వీనర్ దర్శనాల మల్లేశ్, కోకన్వీనర్లు విజ్జగిరి నారాయణ, అరవింద్, అరుణ్‌కుమార్, కొండ రమేశ్ అన్నారు. సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ విషయంలో బీజేపీ నాయకుల ద్వంద విధానాలను ప్రజలంతా గమనించాలన్నారు.

జనగర్జనకు తరలిన బీజేపీ నాయకులు



పిప్పల్‌కోటి నుంచి బస్సులో వెళ్తున్న నాయకులు



నార్నూర్: తరలివెళ్తున్న నాయకులు

తాంసి/నార్నూర్/బోథ్: జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో మంగళవారం బీజేపీ జనగర్జన సభకు తాంసి, భీంపూర్ మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ప్రత్యేక బస్సులు, వాహనాల్లో వెళారు. నార్నూర్, గాదిగూడ మండలాల నుంచి భారీగా తరలి వెళ్లారు. నారూన్‌ర్‌లో గాంధీచౌక్ నుంచి కుమురంభీం చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. తెలంగాణలో వచ్చేది డబుల్ ఇంజిన్ సర్కారేనని, ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని మండల అధ్యక్షుడు బండు అన్నారు. రాష్ట్ర నాయకుడు జాదవ్‌రెడ్డి నాయక్, దేవిదాస్ తదితరులు ఉన్నారు. బోథ్ మండలం నుంచి బస్సులు, జీపుల్లో తరలివెళ్లారు. రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని ఓబీసీ మోర్చా నియోజకవర్గ అధ్యక్షుడు తూము సూర్యం మర్యాదపూర్వకంగా కలిశారు. మండల ప్రధాన కార్యదర్శి తుకారాం, ముత్యం, పలువురు నాయకులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

నేరడిగొండ: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో 44వ జాతీయ రహదారిపై రోల్ మామడ టోల్‌ప్లాజా వద్ద మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సాయన్న మాట్లాడుతూ కోడ్ అమల్లో ఉండడంతో నిరంతరం తనిఖీలు ఉంటాయన్నారు. మద్యం నగదు తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

బోథ్: మండలంలోని అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న ఘన్‌పూర్ చెక్‌పోస్టును పోలీసులు, అధికారులు తనిఖీ చేపడుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ప్రతీ వాహనాన్ని మంగళవారం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీలు చేపడుతున్న సమయంలో వీడియోలో చిత్రీకరిస్తున్నారు.

బోథ్: మండలంలోని అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న ఘన్‌పూర్ చెక్‌పోస్టును పోలీసులు, అధికారులు తనిఖీ చేపడుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ప్రతీ వాహనాన్ని మంగళవారం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీలు చేపడుతున్న సమయంలో వీడియోలో చిత్రీకరిస్తున్నారు.

ఈ-కేవైసీ కోసం పరుగులు

ఇచ్చోడ: ఈ-కేవైసీ అప్‌డేట్ కోసం ప్రజలు ఆధార్ సెంటర్లకు పరుగులు పెడుతున్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆధార్ సెంటర్ వద్ద ఈకేవైసీ నమోదు చేసేందుకు పిల్లపాపలు వచ్చారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

ఇంద్రవెల్లి: వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పత్తిని సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లకు సంబంధించి రైతులు తమ ఆధార్‌కార్డును అప్‌డేట్ తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి యు.రమేశ్ మంగళ‌ప్రకటనలో తెలిపారు. ఆధార్, బ్యాంక్ ఖాతా, ఫోన్‌నంబర్‌కు లింక్ ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL -II
1st Floor, Triveni Complex, Abids, Hyderabad

O.A. No. 990 of 2022

BETWEEN
HDFC Bank Ltd., ...Applicant
AND
Madduri Goutham Reddy ...Defendant

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
Mr. Madduri Goutham Reddy, S/o. Mr. Nagamalleswaram Reddy Madduri, H. No. B-983, NGO Colony, Vanasthalipuram, Hyderabad - 500070. **Also at:** Mr. Nagamalleswaram Reddy Maddur, S/o. Mr. Anil Reddy, D. No. 62-161, Nagarjuna Colony, Mandamaari, Adilabad, Telangana - 504231. ...Defendants

Please take the summons in the above **O.A. No. 990 of 2022** filed by the Applicant for Recovery of money of **Rs. 58,72,234.84/- (Rupees Fifty Eight Lakhs Seventy Two Thousand Two Hundred Thirty Four and Eighty Four Paise Only)** against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "**Sakshi**" Telugu Daily and posted the matter in **30-11-2023.**

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:

i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application;
iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on **30.11.2023 at 10.30 a.m** at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001 in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.

Take notice that in case of default the Application will be heard and determined in your absence

Given under my hand and seal of this Tribunal on this the **6th day of October, 2023.**

(By order of the Court)

Registrar
Debts Recovery Tribunal - II
Hyderabad